క్లుప్తంగా

నష్టపరిహారం చెక్కులు అందజేత

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలో విద్యుత్ ప్రమాదాలలో పశు సంపదను కోల్పోయిన రైతులకు, మృతి చెందిన బాలుడి కుటుంబానికి విద్యుత్‌శాఖ నుండి మంజూరైన నష్టపరిహారం చెక్కులను సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బాధితులకు పంపిణీ చేశారు.జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించిన 13 బర్రెలు విద్యుత్ ప్రమాదంలో మరణించగా ఐదు లక్షల పరిహారాన్ని అందించారు.బొల్లారం మున్సిపల్ పరిధిలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రిషి అనే బాలుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, విద్యుత్ శాఖ డీఈ రమేష్ చంద్ర, ఏడి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మురళి, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: దత్తాత్రేయ కాలనీ, గురుగోవిందొసింగ్ నగర్, మహంకాళి నగర్‌లలో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 37 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించే సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

'మనూ' పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్శిటీలోని ఇస్లామిక్ స్టడీస్ విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ సలాఉద్దీన్ 'భారతీయ విశ్వవిద్యాలయాల్లో ఇస్లామిక్ అధ్యయనాలు: ఒక విశ్లేషణాత్మక అ. ధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆయన ఇస్లామిక్ స్టడీస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండి ఇర్ఫాన్ అహ్మద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సమ్మయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్య సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శ్రీనివాస్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు అధికారులు పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు.

స్కూల్ బ్యాగులు అందజేత



విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని డి.ఎస్.కాలనీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ (గడీల ఫౌండేషన్) సహకారంతో స్కూల్ బ్యాగ్‌లను ఎస్ఆర్ కె యువసేన సభ్యులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టారెడ్డిపేట దుర్గానగర్‌లో ఉండే ఓ మహిళ కుటుంబ తగాదాలతో ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్ళింది.తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు తెలిసిన వారి వద్ద విచారించారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం సాయంత్రం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు



స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రిజర్వాయర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 24 కాలనీలలో ప్రతి ఇంటికి శుద్ధి చేసిన రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.. 100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పది మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 5 భారీ రిజర్వాయర్లు నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, బీరంగూడ గుట్టపైన 22 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మూడు రిజర్వాయర్లను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం చక్రపురి కాలనీలో ఐదు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, బంధం కొమ్ము నుండి అమీన్‌పూర్ వరకు రహదారి విస్తరణలో భాగంగా నాలుగు కోట్ల 80 లక్షల రూపాయల హెచ్‌ఎండిఏ నిధులతో చెప్పడుతున్న విద్యుత్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే వాణీనగర్ కాలనీలో 80 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న యుజీడీ మరియు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వాల హయాంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో వేల రూపాయలు ఖర్చు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసే పరిస్థితులు ఉండేవని , తెలంగాణ ఏర్పడిన ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కిందన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 43,791 కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఒక లక్ష 30 వేల కిలో మీటర్ల పైపులైన్ సామర్థ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ మహత్తర పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు ,కోఆప్షన్ సభ్యులు, విద్యుత్‌శాఖ డీఈ రమేష్ చంద్ర, హెచ్‌ఎండబ్ల్యుఎస్ సీజీఎం శ్రీధర్, జీఎం నారాయణ, బీఆర్ఎస్ నాయకుడు బాల్ రెడ్డి, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వడ్డెరల సంక్షేమానికి పెద్దపీట

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మంజీరనగర్‌లో ఏర్పాటు చేసిన వడ్డెర సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో వడ్డెరలకు తగు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు.

'కేర్ కనెక్ట్'.. రోగుల ఆత్మీయ సమ్మేళనం

హైటెక్ సిటీ కేర్ ఆస్పత్రిలో నిర్వహణ



హైటెక్‌సిటీ కేర్ ఆస్పత్రిలో కేర్ కనెక్ట్‌లో పాల్గొన్న వైద్యులు, రోగులు, సంరక్షకులు

గచ్చిబౌలి: 'కేర్ కనెక్ట్' పేరిట హైటెక్‌సిటీ కేర్ ఆస్పత్రిలో సోమవారం రోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేర్ గ్రూప్ ఆస్పత్రులలో చికిత్స పొందిన రోగులను ఒక్కచోట చేర్చి వైద్యులు, రోగుల మధ్య స్నేహపూరిత అనుబంధ వాతావరణం పెంపొందించడంతోపాటు వారిలో మనోధైర్యాన్ని కల్పించే లక్ష్యంతో కృషి చేస్తున్నామని ఆస్పత్రి నిర్వాహకులు పేర్కొన్నారు. కేర్ ఆస్పత్రి ఆతిథ్య రోగుల సంరక్షణ గ్రూప్ ఉపాధ్యక్షుడు విజయ్ సేథి మాట్లాడుతూ రోగుల్లో మనోనిబ్బరం, ఆరోగ్యం మెరుగుదలే ముఖ్యంగా లక్ష్యంగా కేర్ కనెక్ట్ కార్యక్రమం చేపట్టామన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందితో రోగుల సమ్మేళనం వల్ల వారిలో మరింత ఉత్సాహం కలుగుతుందని, ఆరోగ్యంలో ఎదురయ్యే సవాళ్ళను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమిత్ అగర్వాల్ మాట్లాడుతూ రోగి ఆరోగ్యం విషయంలో నిరంతర సంరక్షణ అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌చంద్, డాక్టర్లు రంగనాథ్, జ్ఞానం మోహన్, రత్నాకర్‌రావు, కీర్తికర్ణం, గీత నాగశ్రీ, అపర్ణశర్మ, వైద్య బృందం పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ నరేష్ జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొరదాల నరేష్ జన్మదిన వేడుకలు సోమవారం అంగరంగ వైభంగా నిర్వహించారు. ఆయన శ్రేయోభిలాషులు, మిత్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శివానంద రిహబిలిటేషన్ సెంటర్‌లోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.నరేష్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు తనకు మరింత అవకాశాన్ని, శక్తిని ఇవ్వాలన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్, మొవ్వా సత్యనారాయణ, రవీందర్ రావు, గోవర్ధన్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హరికృష్ణ, జితేందర్, శ్రీనాథ్, వివిధ కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, కులసంఘాల నేతలు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న కొరదాల నరేష్

లింగంపల్లిలో బస్తీ దవాఖానా ప్రారంభం



దవాఖానా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం వైద్యం, విద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సృజన, మెడికల్ ఆఫీసర్ శైలజ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వామి, మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్, నాయకులు హబీబ్, రవీందర్‌గౌడ్, పద్మారావు, రాంబాబు పాల్గొన్నారు.

రచయిత్రి నికితాదేశ్ పాండేకు శ్రీనివాస్‌రాయప్రోల్ అవార్డు



రాయదుర్గం: ముంబాయికి చెందిన రచయిత్రి నికితా దేశ్‌పాండేకు 15వ శ్రీనివాస్‌రాయప్రోల్ కవితా అవార్డును ప్రకటించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని ఆంగ్ల విభాగం, శ్రీనివాస్ రాయప్రోల్ లిటరరీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతియేటా ఈ అవార్డును అందిస్తారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 120 మంది యువ రచయిత్రుల నుంచి ఎంట్రీలను స్వీకరించగా ఆమెను జ్యూరీ ఎంపిక చేసింది. త్వరలో జరిగే సాహిత్య కార్యక్రమంలో విజేతకు అవార్డుతోపాటు ప్రశంసాపత్రం, రూ.15వేల నగదు పురస్కారం అందిస్తారు.

బతుకమ్మ చీరల పంపిణీ

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పర్వదినం సందర్భంగా ఆడపడుచులకు అందిస్తున్న బతుకమ్మ చీరలను సోమవారం శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ పేదింటి ఆడపడుచులు పండుగను ఆనందంగా చేసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ సర్కారు బతుకమ్మ చీరలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాద్ యాదవ్, శివరాజ్ గౌడ్, బోయ కిషన్, పోశెట్టి గౌడ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, వల్లి, నరసింహులు పాల్గొన్నారు.



బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

మెరుగైన విద్యను అందించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు

జిన్నారం (పటాన్‌చెరు): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ సూచించారు. జిన్నారం మండలంలోని కొర్లకుంట, మంత్రికుంట గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రూ.1.50లక్షలతో ఎంపీపీ రవీందర్‌గౌడ్ రంగులు, పిల్లలకు ఉపయోగపడే వివిధ రకాల బొమ్మలను వేయించారు. ఆయా పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ముస్తాబు చేశామన్నారు. మరిన్ని పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేశ్, రవి, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

500 మందికి కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్

గచ్చిబౌలి: ఎన్నికల వేళ ప్రజాసేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలని శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ సూచించారు. సందయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కొండాపూర్ డివిజన్ కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సందయ్య ట్రస్ట్ ద్వారా కొన్నేళ్ళుగా ప్రజలకు వైద్యం, విద్యా రంగంలో చేయూత అందిస్తున్నామన్నారు. ఓటు అమూల్యమైనదని, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహయాదవ్, జంగయ్యయాదవ్, ఆంజనేయులు, చంద్రశేఖర్‌యాదవ్, జయరామ్, రాములుగౌడ్, నరసయ్య, మల్లేష్‌యాదవ్, రామ్‌రెడ్డి, రంగన్న, మేరి పార్వతి పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రామచంద్రాపురం పట్టణంలోని స్ఫర్ష్ శక్తి సదన్ ఆవరణలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు జయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనారోగ్యానికి దారి తీస్తున్న కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలు, విద్యార్థులకు వివరించారు.జిల్లా ఎంపవర్‌మెంట్ ఫర్ ఉమెన్ కోఆర్డినేటర్ పల్లవి మాట్లాడుతూ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో శక్తి సదన్ ఇంచార్జ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పటాన్‌చెరు రిటర్నింగ్ అధికారి దేవుజ

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల కోడ్ అమల్లో ఉందని నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకూడదని పటాన్‌చెరు రిటర్నింగ్ అధికారి దేవుజ అన్నారు. పటాన్‌చెరు తహశీల్దార్ కార్యాలయంలో ఎంసీసీ, ఫ్లయింగ్, స్టాటిస్టిక్స్, వీడియో నిఘా, ఖర్చుల పరిశీలన బృందాలతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, గోడలపై రాతలు తొలగించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు.అలాగే నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిబంధనలు అమలయ్యేలా ప్రతీ ఒక్క అధికారి నిమగ్నం అవ్వాలని ఆయన తెలిపారు. కొత్తగా ఎటువంటి అభివృద్ధి పథకాలు రాజకీయ నాయకులు చేపట్టకూడదని, ఇంతకుముందు చేసిన అభివృద్ధి పథకాలు ఉంటే వాటిని కొనసాగించవచ్చని ఆయన తెలిపారు. ఇప్పటినుంచి ఫలితాలు వచ్చేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఫిర్యాదుల కోసం 08455-242005 నంబర్‌ను సంప్రదించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

అరుదైన ఘనత సాధించిన 'ఐఎస్‌బీ'

రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయి బిజినెస్ స్కూళ్ళలో ప్రత్యేకతను సాధించిన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) మరో అరుదైన ఘనత సాధించింది. ప్రపంచంలోని కొన్ని బిజినెస్ స్కూళ్ళలో ఐఎస్‌బీ అక్రిడిటేషన్ల 'ట్రిపుల్ క్రౌన్'ను నిలబెట్టుకున్న బిజినెస్ స్కూల్‌గా గుర్తింపు సాధించింది. పోస్టు గ్రాడ్యుయేట్ బిజినెస్ ఎడ్యుకేషన్‌లో ప్రపంచంలోని ప్రముఖ అధికారులలో ఒకటైన అసోసియేషన్ ఆఫ్ ఎంబీఏ (ఏఎంబీఏ) నుంచి ఐఎస్‌బీ అధికారికంగా రీ- అక్రిడిటేషన్ పొందింది. ఐఎస్‌బీ అకడమిక్ ప్రోగ్రామ్స్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ రామభద్రన్ తిరుమలై మాట్లాడుతూ ఐఎస్‌బీ ప్రపంచవ్యాప్తంగా ఏఎంబీఏ చేత గుర్తింపు పొందుతున్నందుకు ఎంతో సంతోషం. ఐఎస్‌బీలో పనిచేసే అందరి సమిష్టి కృషికి ఇది నిదర్శనం.

32 గ్రాముల కొకైన్ పట్టివేత

నలుగురు అరెస్ట్

గచ్చిబౌలి: కొకైన్ తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు. మణికొండలో నివాసం ఉండే తోట క్రాంతికిరణ్(45) స్థానికంగా నివాసం ఉండే నరేష్ గోపీశెట్టి(36) వద్ద 32 గ్రాముల కొకైన్ కొనుగోలు చేస్తుండగా మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నరేష్‌ను విచారించగా తన సోదరుడు రాజేష్ గోపీశెట్టి (38)నుంచి కొకైన్ తీసుకున్నట్లు వెల్లడించారు. రాజేష్‌ను విచారించగా హఫీజ్‌పేట్‌లో నివాసముండే రాజమండ్రికి చెందిన డ్రగ్ పెడ్లర్ బొమ్మదేవర వీరరాజు(29) నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తరచుగా వీరరాజు గోవాకు వెళ్లి డ్రగ్స్ రవాణ చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. 32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గాంధీ.. • అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్: చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్‌ల పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్, ఇందిరానగర్, శివాజీనగర్ కాలనీలలో సుమారు రూ.40 లక్షల ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ ప్రత్యేక నిధులతో కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం చేపడుతున్నామన్నారు. మరిన్ని నిధులతో కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో..

డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.7 కోట్ల 73 లక్షలతో కాల్వ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈర్ల చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా కాల్వ నిర్మాణం, బతుకమ్మ ఘాట్ పనులు చేపడుతున్నామన్నారు. వైశాలినగర్ నుంచి ఈర్ల చెరువు అలుగు వరకు డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు పనులు వేగవంతంగా చేపట్టాలని, నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తాం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీదుబండలో రూ.20 లక్షల అంచనాతో సీడీపీ ఫండ్స్ ప్రత్యేక నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి, ప్రహరీగోడ నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చామన్నారు. ఎన్నికలలో మరో అవకాశం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తూ , మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు .ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజ్, రాజుయాదవ్, రవీందర్‌గౌడ్, పద్మారావు, రాంబాబు, కృష్ణయాదవ్, రమేష మల్లేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, రాములు,వేణుగోపాల్, రాములు, పవన్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ



మసీదుబండలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ